
# సమ్మె

- ఎం.యాదగిరి రెడ్డి



సమ్మె తారాస్థాయికి చేరుకుంది. 40 రోజులుగా చేస్తున్న సమ్మె ఉధృతమయింది. నాయకులు జోరు- కార్మికుల బేజారు- యూనియన్ జిందాబాద్- జీతాలు పెంచాలి- బోనస్ ఇవ్వాలి- కార్మికుల పిల్లలకి ఉద్యోగాలు ఇవ్వాలి- ఆరోగ్య బీమా చేపట్టాలి- జిందాబాద్ జిందాబాద్- కార్మిక యూనియన్ జిందాబాద్- ఇంక్విలాబ్ జిందాబాద్- యాజమాన్యం మొండివైఖరి నశించాలి- ఫ్యాక్టరీని తెరవాలి- కార్మికుల పొట్టగొట్టవద్దు- అందరి చేతుల్లో నినాదాల అట్టలతో ఊరేగింపు జోరుగా సాగిపోతోంది. 40 రోజుల నుండి చేస్తున్న సమ్మెతో కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. జీతాలు లేవు. ఇండ్లలో సరకులు చెల్లుకున్నాయి. ఇండ్లు గడవడం కనాకష్టమయిపోయింది. కార్మికులు జీతాలు పెంచమని యూనియన్ తరఫున సమ్మె నోటీసు ఇచ్చారు. యాజమాన్యం ఫ్యాక్టరీ పరిస్థితులు బాగోలేవని, ప్రొడక్షన్ ఖర్చులు పెరిగిపోయాయని ఇపుడు పెంచలేమన్నారు. దాంతో సమ్మె మొదలయింది. రోజులు వారాలు గడిచి నెల దాటిపోయింది. రోజు కార్మికులు ఊరేగింపుగా రావడం ఫ్యాక్టరీ ముందు టెంట్‌లో కూర్చోవడం- నినాదాల హోరెత్తించడం- ఇది వారి డ్యూటీ అయిపోయింది. ఈ రోజు కార్మికుల భార్యలు, పిల్లలు, తల్లిదండ్రులు అందరూ పెద్ద ఊరేగింపుగా వచ్చారు. యాజమాన్యం ఫ్యాక్టరీకి ఎపుడో లాకౌట్ ప్రకటించి కూర్చుంది. ఫ్యాక్టరీ భద్రతకు పోలీసు పికెట్‌తో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారు.

ఈ వ్యవహారం కార్మికులకు అగమ్యగోచరంగా తోచింది. ఈ రోజు ఢిల్లీ నుండి ఆలిండియా కార్మిక నాయకుడు ఆనందరావు వస్తున్నాడు. అందుకే కార్మికుల ఈ హడావిడి. ఆనందరావు అరడజను కార్మిక సంఘాలకు నాయకుడు. ఆయన ఆధ్వర్యంలో ఎన్నో సమ్మెలు నడిచాయి. పరిష్కారమయ్యాయి. ఈ రోజు యాజమాన్యంతో చర్చల్లో పరిష్కారం కుదురుతుందని వాళ్ల ఆశ. ఇంతలో ఓ కుర్రవాడు వార్తను చేరవేశాడు. ఆనందరావుగారు వస్తున్నారు. కూర్చున్న వాళ్లంతా ఒక్కసారి లేచి నిల్చున్నారు.

జిందాబాద్ జిందాబాద్

ఆనందరావ్ జిందాబాద్

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి

యూనియన్ జిందాబాద్

యాజమాన్య మొండివైఖరి నశించాలి

దిక్కులు పిక్కటిల్లేటట్లు అరుపులు... కంజర చప్పుళ్లు... వాళ్ల ఆనందానికి హద్దుల్లేవు. అందరి ముఖాలు సంతోషంతో వికసించాయి. ఆనందరావును చూసేనరికి సమ్మె పరిష్కారమైందన్న ఆనందం. ఆనందరావు ప్రతి సంవత్సరం అంతర్జాతీయ కార్మిక మహాసభలకు వెళుతుంటాడు. అమెరికా, రష్యా, వియన్నా, జెనీవా దేశాలు ఈమధ్యే పర్యటించి వచ్చాడు. నెల రోజులుగా ఉప్పిడి ఉపవాసాలున్నవాళ్లు, నగానట్రా అమ్ముకున్నవాళ్లు, పిల్లల రోగాలకు రింగులు, గొలుసులు, రేడియోలు, సైకిళ్లు అయినకాడికి అమ్ముకున్నవాళ్లు... అందరూ ఒక్కసారి ఆనందరావుకు స్వాగతం పలికారు. ముకుళిత హస్తాలతో అర్ధాంగి వెంటరాగా ఇంపోర్టెడ్ కారు దిగిన ఆనందరావుకు స్థానిక కార్మిక నాయకుడు లక్ష్మీపతి దండవేసి మరీ తోడ్కొని షామియానా క్రిందకు తీసుకుని వచ్చాడు. నినాదాలు మిన్నుముట్టాయి. ఒకటే కోలాహలం. ఆనందరావుది భారీ విగ్రహం. తెల్లగా, బొద్దుగా వుంటాడు. తెల్లటి సిల్కు లాల్చీ, దోవతి. నల్ల కళ్లద్దాలు. చేతిలో సెల్‌ఫోన్. ఐదు వేళ్లకు వజ్రాల ఉంగరాలు. ఆయనకు తగ్గట్టు ఆయన సతీమణి లావుగా, బొద్దుగా అరడజను బంగారు ఆభరణాలతో అట్టహాసంగా వచ్చింది. రోడ్డు వెంట పోయే జనం, వాహనాలు అన్నీ ఆగిపోయాయి. అందరూ గుమిగూడారు. లక్ష్మీపతి ఆనందరావు చెవిలో గుసగుసలాడాడు. ఆనందరావు చేతికి మైకు వచ్చింది. ఓ ప్రక్క సతీమణి, మరోప్రక్క లక్ష్మీపతి నిల్చున్నారు.

'డియర్ కామ్రేడ్స్!

మీ విప్లవ పోరాటానికి నా జోహార్లు...

ముఖ్యంగా కార్మికుల భార్యలకు, పిల్లలకు నమస్కారం. ఈ 40 రోజుల మీ శాంతియుత పోరాటానికి నా విప్లవ జోహార్లు. మాటకు ముందు 'విప్లవ' అని పలకందే ఆయనకు మాట రాదు. లక్ష్మీపతి, ఇంకొంతమంది యువకులు చప్పట్లు చరుస్తున్నారు.

ఓ నా కార్మిక సోదర సోదరీమణులారా!

ముందుగా మీరు నన్ను క్షమించాలి...

మీరు 40 రోజులుగా అష్టకష్టాలకోర్చి సమ్మె చేస్తూనే వున్నారు. సమ్మెను దిగ్విజయంగా కొనసాగిస్తున్న మీకు మరొక్కసారి విప్లవాభినందనలు. డియర్ కామ్రేడ్స్! మీ సమ్మె మొదలయింది, నాకు అంతర్జాతీయ కార్మిక సెమినార్‌కు జెనీవా నుండి పిలుపు వచ్చింది. నేను అక్కడున్నా నా ధ్యానంతా మీమీదే. మీ యాజమాన్యం మొండివైఖరితో వుంది. రెండు మూడుసార్లు ఫోనులో మాట్లాడాను. ఇటువంటి మొండి యజమానులెందరినో చూశా. కార్మికుల పొట్టగొట్టి ఫ్యాక్టరీ మూసివేశారు. నా సోదర సోదరీమణులను ఉపవాసాలకు గురిచేశారు. కార్మికుల జీతాలు పెంచమంటే ఫ్యాక్టరీ మూసివేసి మీ పొట్టలుగొడతారా? బజార్లో ధరలు ఎలా మండిపోతున్నాయి? వాళ్ల ప్రొడక్టులు మాత్రం ఏడాదికోసారి ధరలు పెంచుకుపోతారు. మనం అడిగితే ఆపసోపాలు పడుతున్నారు. ఇదెక్కడి న్యాయమండీ! మనమేమన్నా వాళ్ల ఫ్యాక్టరీలో భాగమడిగామా? వాళ్ల ఆస్తులు పంచి ఇవ్వమన్నామా? మనం చేసే పనికి జీతం పెంచమన్నాం. వాళ్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఫ్యాక్టరీ లాకౌట్ ప్రకటించారు. మనం ఊరుకుంటామా! లేబర్ కోర్టుకీడుస్తాం. సమ్మెను

ఉధృతపరుస్తాం. అవసరమైతే దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తాం. ఎలా దిగిరాడో చూద్దాం. ఈ 40 రోజులుగా మీరు పడుతున్న అష్టకష్టాలకు నా మనస్సు కకావికలమైపోయింది. ఈ రోజు చర్చలకు రమ్మని పిలిచారు. తాడోపేడో తేలుస్తాం. కామ్రేడ్స్... మీరేం భయపడవద్దు. రాజీ కుదరకపోతే ఇక్కడే ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం.'

చప్పట్లతో వేదిక మార్మోగింది. ఆనందరావుకీ జై! నినాదాల స్థాయి తారాస్థాయికి చేరుకుంది.

కార్మికా! ఓ కార్మికా!.... కంజర తీసుకుని ఓ కార్మికుడు పాట అందుకున్నాడు. ఆనందరావు అందరి దగ్గర సెలవు తీసుకుని భార్యామణి, లక్ష్మీపతితో కలసి కారెక్కి ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్ వైపు వెళ్లాడు. శ్రీధర్ మెటల్ వర్క్స్ వాళ్లు కార్మికులు సమ్మె నోటీసు ఇవ్వగానే ఫ్యాక్టరీ లాకౌట్ ప్రకటించి ఫ్యాక్టరీ మూసివేశారు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎన్నాళ్లనుండో ఎదురుచూస్తున్నారు. ఫ్యాక్టరీలో సరుకు పేరుకుపోయింది. ధరలు పెరగడం లేదు. ఈ 40 రోజుల సమ్మెతో కంపెనీ గడియారాలు బ్లాకులో విచ్చలవిడిగా అమ్ముడయ్యాయి. కొనేందుకు జనం విరగబడ్డారు. పేరుకుపోయిన సరుకంతా అమ్ముడయిపోయింది. కొన్ని లక్షల రూపాయల లాభాలు వచ్చాయి. నష్టపడ్డదల్లా కార్మికులే. జీతాలు లేక అష్టకష్టాలు పడ్డారు. ఇంటిలో సరుకులు లేక అష్టకష్టాలు పడ్డారు. ఇంటిలో సరుకులు లేక సాయంకాలం హేంగర్లు, నంచులు, కర్చీఫులు చౌరస్తాలో నిలబడి అమ్మినవాళ్లున్నారు. భార్యలను అమ్మగారింటికి పంపినవాళ్లున్నారు. కొద్దోగొప్పో దాచుకున్నవాళ్లు డబ్బు హారతి కర్పూరంలా కరిగిపోయింది. పాలవాళ్లతో, కూరల వాళ్లతో, సరకులిచ్చిన వాళ్లతో మాటపడ్డవాళ్లున్నారు. అంతా సరకు అమ్ముడుపోయాక శ్రీధర్ మెటల్ వర్క్స్ అధిపతి తాపీగా ఆనందరావు, లక్ష్మీపతిలను చర్చల కోసం ఆహ్వానించాడు. రెండు రోజులుగా ఎడతెరిపి లేని చర్చలు జరిగాయి. కార్మికులంతా యూనియన్ ఆఫీసులో సమావేశమయ్యారు. అంతా ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు చర్చలు జరిగాయి. ఫలితం బయటపడలేదు. 100 రూపాయల జీతమన్నా పెరగకపోతుందా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి వచ్చారు. ఆనందరావు, లక్ష్మీపతిల కోసం చూస్తున్నారు. ఇంతలో కారు రయ్‌మని వచ్చి యూనియన్ ఆఫీసు ముందు ఆగింది. అందరూ ఒక్కసారి లేచి నిల్చున్నారు. ఆనందరావు, లక్ష్మీపతి లోపలికి వచ్చారు.

'కామ్రేడ్స్! అంతా కూర్చోండి'

'సార్ ఏమయింది?' అన్ని కంఠాలు ఒక్కసారి ప్రశ్నించాయి. వాళ్ల ఆత్రుత వాళ్లది.

'డియర్ కామ్రేడ్స్!'

సిగరెట్ లాగించి క్రింద వేశాడు ఆనందరావు.

'కంపెనీవాళ్లు చర్చలకని పిలిచారు. వాళ్లు ఇలా చేస్తారనుకుంటే అసలు చర్చలకు వెళ్లేవాళ్లం కాదు. కంపెనీ మూసివేస్తామంటున్నారు. అప్పుల్లో కూరుకుపోయామంటున్నారు. ఇక ఫ్యాక్టరీ నడపడం మా వల్ల కాదంటున్నారు.'

చావు కబురు చల్లగా చెప్పాడు ఆనందరావు.

అందరి గుండెల్లో రాయి పడ్డట్టయ్యింది. వాళ్ల ఆశాసౌధాలు ఒక్కసారి కూలిపోయాయి. ఎవరికీ ఏమీ తోచడం లేదు.

'సార్! మా గతి...' అందరిదీ ఒకటే ప్రశ్న.

'కామ్రేడ్స్! వాళ్లు ఫ్యాక్టరీని మూసేస్తామంటే అంత సులభంగా వదులుతామా? కోర్టుకెక్కుతామని చెప్పా! కాంపెన్సేషన్ కింద కొన్ని లక్షల రూపాయలు చెల్లించాల్సి వస్తుందని చెప్పా. అసలు నష్టముంటేగా– వాళ్లు మూసెయ్యడానికి. తాటాకుల బెదిరింపులకు ఈ ఆనందరావు భయపడతాడా! ఇటువంటి వాళ్లను సవాలక్ష మందిని చూశాడీ ఆనందరావు!'

ఆ వెంట లక్ష్మీపతి అందుకున్నాడు.

'ఏదో ఆనందరావుగారు చెయ్యబట్టి ఫ్యాక్టరీ మూసివేయకుండా చేయగలిగారు.'

మళ్లీ అందరి ముఖాల్లో ఒకింత సంతోషం...

'యూనియన్ జిందాబాద్! ఆనందరావుకీ జై!!' లక్ష్మీపతితో అందరూ శృతి కలిపారు.

'మరి జీతమేమన్నా...' భిక్షపతి లేచి అరిచాడు.

'మొదటికే మోసం వస్తుంటే... అన్నట్లుంది నీ సంగతి. ఫ్యాక్టరీ మూస్తామంటే ఏదో సర్దాను. ప్రస్తుతానికి పెరుగుదలలేం లేవు. మన కోర్కెల మీద ఓ కమిటీ వేశారు. అదే సంతోషం. కంపెనీకి లాభాలొస్తే అప్పుడు చూద్దామన్నారు- డియర్ కామ్రేడ్స్... పరిస్థితులు మునుపటిలా లేవు. ఎన్ని ఫ్యాక్టరీలు మూతపడటం మనం చూడట్లేదు. మనం కొంచెం సర్దుకుపోవాలి.'

'మరి 40 రోజుల జీతం సంగతి?'

'నో వర్క్- నో పే- అన్నారు. తప్పదు మరి.'

అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

'సెంట్రల్ కమిటీ ఆదేశం మేరకు తాము చేసిన సమ్మెకు ఇదా మూల్యం. ఏం సాధించాం? ఎంతోమంది అప్పులు చేసి కూర్చున్నారు. ఇప్పుడెట్లా?' అందరిదీ ఇదే ఆలోచన. 'కామ్రేడ్స్! కొంత అడ్వాన్స్ ఇవ్వమన్నాను.'

అందరూ ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నారు. కొంతలో కొంత నయం. 'నెలనెలా కొంత సర్దుబాటు చేసుకుంటారు. మీ పరిస్థితి చూస్తే నాకే దుఃఖం వస్తోంది. నానాకష్టాలు పడ్డారు పాపం' ఆనందరావు ముక్కు చీదాడు.

'ఇక మనం ఈ జన్మలో సమ్మె చేస్తామా సార్...' కడుపులోని మాట బయటపెట్టాడు ఓ కార్మికుడు. 'అదే పొరపాటోయ్... కంపెనీ లాభాల్లో వుంటే నేను మాత్రం వదుల్తానా. సమయం చూసి వాతబెడదాం. మనమంతా ఐకమత్యంగా వుంటే ఏదైనా సాధిస్తాం. ఆవేశాలు పనికిరావు. నాకు మాత్రం బాధ లేదూ. రేపే మీరంతా డ్యూటీలో జాయినవ్వండి. మీ భార్యాపిల్లల ముఖం చూస్తే నాకే ఏడుపొస్తోంది. ఒక అపజయం మరో విజయానికి సోపానమన్నారు మన పెద్దలు. తప్పకుండా మనకు మంచి రోజులొస్తాయి. అవతల ఫ్లైయిన్ టయమవుతోంది. వస్తా!' అంటూ అందరికీ నమస్కరించి కారెక్కాడు ఆనందరావు. లక్ష్మీపతి విమానాశ్రయం వరకు వెంట వెళ్లాడు.

మరో పది రోజులకు శ్రీధర్ మెటల్ వర్క్స్ కార్మికులు భిక్షపతి, మంగయ్య, రెడ్డి తమ పిల్లలను తీసుకుని సాయంసంధ్యా సమయంలో టాంక్‌బండ్ మీద బెంచీల మీద కూర్చున్నారు. పిల్లలకు శనక్కాయలు, బఠాణీలు కొనిపెట్టి మాట్లాడుకుంటూ కూర్చున్నారు. సమ్మె తర్వాత ఇపుడిపుడే ఫ్యాక్టరీ పనులకు అలవాటుపడ్డారు. వచ్చీపోయే వాహనాలతో టాంక్‌బండ్ రద్దీగా వుంది. ఆ రోజు అడ్వాన్స్‌గా ఫ్యాక్టరీవాళ్లు కొంత మొత్తాన్నిచ్చారు. జంటలతో బెంచీలన్నీ నిండిపోయాయి. ఒకరి గోడు ఒకరు చెప్పుకుంటున్నారు. రయ్ మని ఓ స్కూటర్ వాళ్ల ముందాగింది. నలుగురూ లేచి నిల్చున్నారు.

'కామ్రేడ్స్... అంతా క్షేమమే కదా!' లక్ష్మీపతి పలకరింపు.

వెనుక భార్యామణి కాబోలు కొత్త నెక్లెస్‌తో ధగధగ మెరిసిపోతోంది.

'ఏదో ఇలా వున్నాం సార్'

'ఈరోజు అడ్వాన్స్ ఇచ్చారటగా'

'అవున్సార్'

'ఆఁ మనమంటే ఏమనుకున్నారు? వాళ్లను మూడు చెరువుల నీళ్లు తాగించాం. ఇవ్వకేం చేస్తాడు?'

'ఈ నెల యూనియన్ చందాలివ్వాలోయ్'

'సెంట్రల్ కమిటీకి పంపాలి'

'ఇచ్చాం సార్' అందరూ ఒకేసారి అన్నారు.

వాళ్ల మనసులు అంత సంతోషంగా లేవు. ఈ సమ్మెలు, యూనియన్ల వల్ల సాధించిందేమిటి అన్నది వాళ్ల మెదళ్లలో దొలిచే జవాబులేని ప్రశ్న.

అటుప్రక్క శ్రీధర్ మెటల్ వర్క్స్ వారి మేనల్లుడు కంపెనీ సూపరింటెండెంట్ భార్యాపిల్లలతో కూర్చున్నాడు.

## పెన్ను-గన్ను

పెన్ను మూసి
నువ్వు గన్ను
తుడుస్తున్నపుడే
నీ గుండె ఆగిపోతే బావుణ్ణు!
నీ మీద కలంతో
గుళ్లు కురిపించక పోదును!

- గుడిమెట్ల గోపాలకృష్ణ

'హలో' లక్ష్మీపతి పలకరించాడు.

'హలో సార్'

'ఏమిటి ఇటు వచ్చారు?'

'ఏదో పిల్లల గొడవ పడలేక...' నవ్వాడు.

'సరే కామ్రేడ్స్! సికింద్రాబాద్‌లో మీటింగ్ వుంది. వస్తా...' భార్యామణితో స్కూటరెక్కి వెళ్లిపోయాడు. అక్కడ కూచున్న నలుగురు కార్మికులు 'ఇది కలా? నిజమా?' నమ్మలేకపోయారు. 'డొక్కు సైకిలు మీద తమ వెంట తిరిగి నెలనెలా తామిచ్చే పదీ పరకలతో బతికే లక్ష్మీపతి స్కూటరేంటి? ఆయన భార్యకు రవ్వల నెక్లెసేంటి?' వాళ్లకు బోధపడట్లేదు.

'హలో... కామ్రేడ్స్!'

'ఎవరబ్బా...' అనుకుని నలుగురూ అటువైపు తిరిగారు.

శ్రీధర్ మెటల్ వర్క్స్ వారి మేనల్లుడు, ఫ్యాక్టరీ సూపరింటెండెంట్ మూర్తి ముసిముసి నవ్వు నవ్వుతూ వచ్చాడు. 'ఏంటి? మీ ఆలోచన లక్ష్మీపతి స్కూటర్, ఆయన భార్య నెక్లెస్ గురించేనా?'

'అవున్సార్... బాగానే పసిగట్టారు' నలుగురూ ఒకేసారన్నారు. 'ఎంత పిచ్చివాళ్లోయ్ మీరు... కష్టం మీది, ఫలితం వాళ్లది. మీరు ఈ 40 రోజులు సమ్మె చేశారు. అష్టకష్టాలు పడ్డారు. వాళ్లు నాలుగ్గంటల్లో సంపాదించుకున్నారు. మొన్నటి సమ్మె పుణ్యమా అని ఈయన... అదే మీ లక్ష్మీపతికి ఓ 50 వేలు, మీ కేంద్ర కమిటీ లీడర్ ఆనందరావు గారికి బంజారాహిల్స్‌లో అందమైన బంగళా కానుకగా లభించాయి. అయినా నాకెందుకులే... వస్తా' అంటూ మూర్తి వెళ్లిపోయాడు. వాళ్ల తల గిర్రున తిరిగిపోయింది. ఆకాశం తలక్రిందులైనట్లయింది.

యూనియన్ జిందాబాద్... లక్ష్మీపతి జిందాబాద్... ఆనందరావు జిందాబాద్... ఇంక్విలాబ్ జిందాబాద్... రిక్షా తొక్కే లక్ష్మీపతి యూనియన్ నాయకుడయ్యాడు.

ప్రతిపక్ష నాయకుడు ఆనందరావు...

'తాము నమ్మి, చేసిన సమ్మెకు ఫలితం ఇదా!' ఇక వాళ్లు ఆలోచించలేకపోయారు. ❑

# ఎందుకో మరి?

*- ప్రతాప వెంకట సుబ్బారాయుడు.*

కఠిన శిలని
కమనీయ శిల్పంగా మలచే నువ్వు
సున్నితమైన మనసు పొరలు తొలగించుకుని
మహనీయుడివి ఎందుకు కాలేవో మరి...

పుణ్యం కోసం యోజనాల దూరం వెళతావు
హుండీలో భూరి కానుకలు వేస్తావు
పక్కనున్న ఆర్త మాధవుడిని పట్టించుకోవు
గుప్పెడు అన్నం పెట్టవు... గుక్కెడు నీళ్లు ఇవ్వవెందుకో మరి...

క్యూలో నుంచుని కష్టార్జితం కట్టి
షట్టర్లు మూసేస్తే ఉవ్వెత్తున విలపిస్తావు
అది అరచేతిలో వైకుంఠమని తెలిసినా
మోసపోవడానికి సిద్ధపడే శలభాని వవుతావెందుకో మరి...

పల్లెలు తెల్సు... పట్నాలకి పట్టుగొమ్మలనీ తెలుసు
కథల్లో కవితల్లో చదివి ఆహా! ఓహో!! అంటావు
అభివృద్ధి పరచమనేసరికి
ఆమడ దూరం వుంచుతావెందుకో మరి...